
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024





పోలీసుల త్యాగం.. అజరామరం

- దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీరులెందరో
- నేడు జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం

ప్రజా రక్షణ.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ.. శత్రువులతో యుద్ధం.. మావోయిస్టులతో అంతర్గతపోరు.. తదితర విధుల్లో దేశానికి అపూర్వ సేవలందించే పోలీసులు ఆదర్శప్రాయులు. విధి నిర్వహణలో ఎంతటి తెగువకైనా సిద్ధమై ముందుకెళ్తుంటారు. ఆ వీరోచిత పోరాటంలో ప్రాణాలు సైతం త్రుణప్రాయంగా వదులుతారు. అలాంటి ఉన్నతమైన వ్యక్తులు మన జిల్లాలోనూ ఉన్నారు. వారిని గుర్తు చేసుకునేందుకు ఏటా అక్టోబరు 21న జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ రోజును పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భిన్నమైన కార్యక్రమాలు తలపెట్టనుంది. పోలీసు ఇమేజ్‌ను చూపే సినిమాలు, వీడియో క్లిప్స్ ప్రదర్శన.. పోలీసు అమరవీరుల స్వస్థలాల సందర్శన.. ఓపెన్ హౌస్.. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పోలీసుల త్యాగాలపై సెమినార్, యూనిటీ రన్, క్యాండిల్ ర్యాలీ తదితర కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

ప్రత్యేక కథనం 6లో

నాలుగు నెలలకే వైఫల్యమా?



- కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం
- 'డయేరియా'ను బాధ్యులుగా చేస్తున్న వైనం
- వైసీపీ నేతల తీరుపై ముప్పేట విమర్శలు

విజయనగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో డయేరియా మరణాలతో వైసీపీ రాజకీయ క్రీడ మొదలుపెట్టిందన్న ఆరోపణ సర్వత్రా వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వంపై ఆ పార్టీ విషపు ప్రచారానికి దిగిందని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కొద్దిరోజులుగా జిల్లాలో డయేరియా ప్రబలుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా చంపావతి నదీ పరివాహక గ్రామాల ప్రజలు డయేరియా బారిన పడుతుండడం మిస్టరీగా మారింది. అయితే భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. డయేరియాతో ఒకరు మాత్రమే మృతిచెందినట్టు జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. ప్రతిపక్షాలు 11 మరణాలు సంభవించినట్టు ప్రచారం చేస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ ఈ విషయంలో రాద్ధాంతం చేస్తోంది. డయేరియాను రాజకీయం చేయడం తగునా? అన్న ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అవుతోంది. అంతకు ముందు ఐదు సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నది తామేనన్న విషయాన్ని వైసీపీ నేతలు మరచిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చంపావతి నదీ తీర గ్రామాలైన కోటగండ్రేడు, గోషాడ, పెనుబర్తి, గుర్ల తదితర గ్రామాల్లో డయేరియా కేసులు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. జిల్లా మొత్తం కాకుండా కేవలం చంపావతి నదీ తీర గ్రామాలు.. అదీ గుర్ల మండలంలో వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. నది చెంతనే ఉండడంతో ఈ గ్రామాల్లో తక్కువ లోతులోనే భూగర్భ జలాలు లభిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే 15 నుంచి 20 అడుగుల లోతులోనే తాగునీటి బోర్లు వేశారు. ఆ బోర్ల నీటిని తాగిన వారే డయేరియా బారిన పడ్డారనేది వైద్యులు చెబుతున్న మాట. అయితే వ్యాధి వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుద్ధప్రాతిపదికన గుర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటుచేసింది. తాత్కాలిక బెడ్లు తెచ్చి రోగులకు సేవలందిస్తోంది. నెల్లిమర్ల సామాజిక ఆస్పత్రితో పాటు మిమ్స్‌లో సైతం బాధితులకు ప్రత్యేక వైద్యసేవలందిస్తోంది. అయినా వైసీపీ అదే పనిగా రోగులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ప్రచారం చేస్తుండడాన్ని ప్రజలు కూడా విమర్శిస్తున్నారు.

యంత్రాంగం అప్రమత్తం..

డయేరియా వెలుగుచూసిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమైంది. భూగర్భ జలాలు కలుషితం కావడమే ఈ పరిస్థితికి కారణమని తెలిశాక గుర్ల మండలంలోని 15 గ్రామాల్లో తాగునీటి వనరుల వద్ద సూపర్ క్లోరినేషన్ చేపట్టారు. ట్యాంకర్ల ద్వారా రక్షిత నీరు అందిస్తున్నారు. అటు పారిశుధ్య పనులు కూడా ముమ్మరంగా చేపట్టారు. వాస్తవానికి ఐదేళ్లగా నీటి పరీక్షలు సక్రమంగా జరగలేదు. గ్రామాల్లో భూగర్భ జలాల పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. కేంద్రం అందించిన ఆర్థిక సంఘం నిధులను సైతం పక్కదారి పట్టించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించలేదు. ఈ కారణాలతోనే ప్రస్తుతం పరిస్థితులు గాడితప్పాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

కొవిడ్ మరణాలను దాచిన వైసీపీ సర్కారు

వైసీపీ హయాంలో కొవిడ్ విలయతాండవం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సరైన వైద్యసేవలందక వందలాది మంది పిట్టల్లా రాలిపోయారు. కానీ నాటి వైసీపీ ప్రభుత్వం అంకెల గారడీ చేసింది. వందల మంది చనిపోతే పదుల సంఖ్యలో లెక్క చూపారు. ఆ సమయంలో కొవిడ్ ఆస్పత్రులుగా గుర్తించిన నెల్లిమర్ల మిమ్స్‌తో పాటు జిల్లా కేంద్రాస్పత్రిలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందించలేకపోయింది. వైద్యలకు కిట్లు, శానిటైజర్ అందించకపోవడంతో వైద్యారోగ్య శాఖ సిబ్బంది చాలా ఇబ్బందిపడ్డారు. చివరకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులు చేపట్టే కార్మికులకు సైతం రక్షణ కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఇప్పుడు డయేరియా వెలుగుచూడడంతో దానిని రాజకీయాంశంగా మార్చి ప్రయోజనాలు పొందాలని భావించడం దారుణమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నేనొస్తా.. మీరెవరొస్తారో చెప్పండి

- ప్రజారోగ్యంపై చర్చకు సిద్ధం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజారోగ్య పరిస్థితులపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, వైసీపీ నుంచి ఎవరొస్తారో? ముందుకు రావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సవాల్ విసిరారు. టీడీపీ కార్యాలయంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునతో కలిసి ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకూ వైద్య ఆరోగ్యశాఖలో చాలా మంది ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితి లేదని, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలకు నాడు నరకం చూపించారని, వందలాది కోట్ల రూపాయల బకాయిలు ఉంచేశారని చెప్పారు. గత ప్రభుత్వంలోని బకాయిలను వైసీపీ నాయకులు టీడీపీ ప్రభుత్వ బకాయిలుగా పేర్కొనడం ద్వారా ప్రజలను తప్పుతోవ పట్టించడం దారుణమని, దీనిని తాము ఖండిస్తున్నామన్నారు. గుర్లలో డయేరియాపై రాజకీయం చేస్తున్నారని, ప్రతిపక్ష నేతలకు ఆరోపించడానికి ఇంకా ఏమి దొరకలేదా? అని ప్రశ్నించారు. డయేరియాతో ఆ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కేజీహెచ్‌లో మరణించారని, మిగతా ఏడుగురివి సహజమరణాలని అన్నారు. ఆ ప్రాంతంలో ఏ కారణంతో చనిపోయినా ప్రతిపక్ష వైసీపీ డయేరియాతో మరణిస్తున్నారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. డయేరియాకి సంబంధించిన సమాచారం అందగానే వైద్య బృందం అప్రమత్తం అయ్యిందన్నారు. ప్రస్తుతం గుర్ల ప్రాంతంలో డయేరియా అదుపులో ఉందని, ప్రతిపక్షంగా వైసీపీ అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి నేతల వరకు వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. సమావేశంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, నడిపిల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు పవన్‌కల్యాణ్ రాక

- గుర్లలో డయేరియా బాధితులను పరామర్శించనున్న ఉప ముఖ్యమంత్రి

విజయనగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి)/దాసన్నపేట: ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డుమార్గంలో బయలుదేరి నెల్లిమర్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ పేట సోర్సు వద్దకు చేరుకుంటారు. అక్కడ తనిఖీ అనంతరం గుర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శిస్తారు. 11.30 గంటలకు గుర్ల గ్రామానికి చేరుకుని జలజీవన్ మిషన్ పనులను, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరా తీరును పరిశీలిస్తారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడతారు. 12 గంటలకు గుర్లలో బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అధికారులతో డయేరియా పరిస్థితిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి, 4.10 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్తారని కలెక్టర్ తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు కూడా డయేరియా బాధితులను పరామర్శించనున్నారు.

గుర్లలో అదుపులో డయేరియా..

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గుర్లలో డయేరియా అదుపులోకి వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి ఆయన నివేదిక అందించారు. తాగునీటి సమూనాలను ప్రయోగశాలకు పంపించగా, నీరు సరఫరా చేసే పైపులు డ్రైనేజీ వ్యవస్థలో ఉండడం వల్ల లీకేజీ అయ్యి తాగునీరు కలుషితమైందని స్థానిక అధికారులు వివరించినట్లు పేర్కొన్నారు. ఈనెల13న ఒకరితో డయేరియా కేసులు మొదలుకాగా, 14న 55 కేసులు, 15న 65 కేసులు నమోదయ్యాయని, ఆ తర్వాత నుంచి కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. శనివారం ఒక్కకేసు మాత్రమే నమోదైందని, 53 మంది చికిత్స పొందుతుంద న్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ గుర్లలో డయేరియాతో ఒక్కరు మాత్రమే చనిపోయారని, అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ డైరెక్టరు డాక్టర్ పద్మావతి నివేదిక పంపారని తెలిపారు.

బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధన

- జిల్లాలో నాలుగు హాస్టళ్లు ఎంపిక
- విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యం


6

పారిశ్రామికంగా ప్రోత్సహిస్తే..

సిరుల పంటే..

- ఏజెన్సీలో వ్యవసాయ ఆధారిత చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు
- గిరిజన రైతుల పంటలకు గిట్టుబాటు ధర ..
- స్థానికంగా గిరిజన యువతకు ఉపాధి
- ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విన్నపం

6

డ్వాక్రా బజార్‌లతో ఆర్థిక ఆసరా

- సరస్ ముగింపు కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



7

1456 మంది అభ్యర్థుల హాజరు

- కేజీబీవీ పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తుల పరిశీలన తంతు ఆదివారంతో పూర్తి అయ్యింది. జిల్లా వ్యాప్తంగా 52 పోస్టులకు 1959 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. వీరిలో 1456 మంది అభ్యర్థులు మాత్రమే పరిశీలనకు హాజరయ్యారు. పట్టణంలోని దాసన్నపేటలో ఉన్న బాలికోన్నత పాఠశా లలో ధ్రువ పత్రాల పరిశీలన జరిగింది. 42 బృందాలు ఈ ప్రక్రియలో పాల్గొన్నాయి. డీఈవో ప్రేమకుమార్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగింది. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభ్యర్థులు ఉన్నారు.





ఇటీవల లాకౌట్ ఎత్తివేసి కొద్దిరోజుల్లో ఉత్పత్తి ప్రారంభించనున్న జేఎస్ఎల్ కర్మాగారం

పూర్వ వైభవం వస్తుందా?

- ఒకప్పుడు పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందిన కొత్తవలస
- ఒక్కొక్కటిగా మూతపడిన పరిశ్రమలు
- వలస కూలీలుగా మారిన కార్మికులు
- కొత్త పరిశ్రమల ఏర్పాటు ప్రశ్నార్థకమే

కొత్తవలస, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమైక్యాంధ్రరాష్ట్రంలో పరిశ్రమలు అత్యధికంగా ఉన్న మండలంగా పేరొందిన కొత్తవలసలో కొన్నాళ్లుగా అందుకు భిన్నమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవి మూతపడుతున్నాయి. ఇంకొన్ని ఆగుతూ .. నడుస్తూ సాగుతున్నాయి. ఈ పరిస్థితిని గమనిస్తున్న పెద్దలు ఒకనాటి పరిస్థితిని తలుచుకుని ఆవేదన చెందుతున్నారు.

నాడు పారిశ్రామిక వాడగా కొత్తవలస మండలాన్ని పిలిచే వారు. పరిశ్రమల ఏర్పాటు కోసమే కొన్ని గ్రామాల భూములను గుర్తించి పరిశ్రమల జోన్‌గా పేరు పెట్టారు. చాలా సంవత్సరాలు ఇదే కళ కనిపించేది. ఎక్కడ చూసినా ఫ్యాక్టరీలు, కార్మికులు, లారీల రాకపోకలతో ఆ ప్రాంతం కళకళలాడేది. పారిశ్రామిక రంగంలో ఒక వెలుగు వెలిగిన కొత్తవలస మండలంలో పరిశ్రమలన్నీ ఒక్కొక్కటిగా మూతపడ్డాయి. రాష్ట్రంలోనే పెంకుల పరిశ్రమ అంటే కొత్తవలస మాత్రమే గుర్తుకువచ్చేది. 22 పెంకుల పరిశ్రమలు నడిచేవి. హిమాలయ, హిమగిరి, సౌభాగ్య, సాయి వంటి సిమెంట్ పరిశ్రమలను నెలకొల్పారు. గోగునారతో తయారు చేసే గోనె సంచులు తయారు చేసే పరిశ్రమ, కేవలం పురి కొసలను తయారు చేసే పరిశ్రమలు ఉండేవి. వివిధ పరిశ్రమలలోని యంత్రాలకు అవసరమైన పరికరాలను తయారు చేసే సింహగిరి పేరుతో మౌల్డింగ్ పరిశ్రమ ఏర్పాటు చేశారు. స్టెయిన్‌లెస్ స్టీల్‌కు ముడి ఉత్పత్తిగా తయారు చేసే ఫెర్రోక్రోమ్ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఈ విధంగా పారిశ్రామిక రంగంలో ఒక వెలుగు వెలిగిన పరిశ్రమలన్నీ ఒక్కొక్కటిగా మూత పడ్డం ప్రారంభించాయి.

తిరోగమనంలో..

కాలానుగుణంగా పెంకులతో నిర్మాణం చేసే ఇళ్లకు బదులు ప్రతి ఒక్కరూ కాంక్రీట్ నిర్మాణం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పెంకులకు డిమాండ్ తగ్గింది. 22 పరిశ్రమలూ మూతపడ్డాయి. కొంతమంది పెంకుల పరిశ్రమల యజమానులు కాలానుగుణంగా డెకరేటివ్ టైల్స్ తయారీని మొదలు పెట్టినా ఆశించినంత ఆదరణ లేక వాటిని కూడా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదే సమయంలో కొత్తవలసలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో మూతపడిన పరిశ్రమల స్థలాలకు రియల్ ఎస్టేట్ భూమ్ వచ్చింది. సిమెంట్ పరిశ్రమలనూ మూసేశారు. ఫెర్రోక్రోమ్ పరిశ్రమలకు ముఖ్యముడి సరుకు విద్యుత్ కాగా ప్రభుత్వం ఆ పరిశ్రమలకు విద్యుత్ చార్జీలలో రాయితీ ఇవ్వకపోవడంతో మూడు ఫెర్రోక్రోమ్ పరిశ్రమలలో ఒకదానిని పూర్తిగా మూసేశారు. డెక్కన్, జేఎస్ఎల్ కర్మాగారాలు ముక్కుతూ మూలుగుతూ నడుస్తున్నాయి. నాలుగు నెలల కిందటి వరకు జెఎస్ఎల్ పరిశ్రమ లాకౌట్‌లోనే ఉండేది. మరో జూట్ పరిశ్రమ ప్రస్తుతం లాకౌట్‌లో ఉంది. కంటకాపల్లి పంచాయతీలో నున్న శారదా కర్మాగారంలో మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. కాగా వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు పరిశ్రమలను మూసేసిన కొద్ది రోజుల వరకు ఆందోళన చేయడం.. ఆపై కూలి పనులు చేసుకోవడానికి వలసబాట పట్టడం ఇక్కడ సాధారణంగా మారింది.

కొత్త పరిశ్రమల ఏర్పాటు కలే!

కొత్తవలసలో పరిశ్రమల ఏర్పాటు ఇకపై కలగానే మిగలొచ్చు. విశాఖకు సమీపంలో ఉండడంతో గ్రామాల్లో సైతం భూముల ధరలు నింగినంటడంతో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరైనా వచ్చినా ఈ ప్రాంతంలో భూముల ధరలు చూసి హడలిపోతున్నారు. వెనక్కు వెళ్లిపోతున్నారు.

వారి త్యాగం.. అజరామరం

- దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీరులెందరో
- నేడు పోలీసు అమరవీరుల దినం

విజయనగరం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి)

దేశ సంరక్షణే ధ్యేయంగా.. ప్రజా రక్షణే ఆశయంగా చేసుకునే పోలీసులు విధి నిర్వహణలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా వెరవరు. కష్టమొచ్చినా.. ఇబ్బందులు ఎదురైనా ముందుకే దూసుకెళ్తారు. సరిహద్దులో శత్రువులతో జరిగే పోరులో నిత్తురోడుతూ పోరాడిన వారెందరో! మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ పోలీసు బలగాలు ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటూ దీటుగా ఎదుర్కొంటున్నాయి. ఆ క్రమంలో ఎందరో వీరులు ప్రాణాలు అర్పించారు. వారి పోరాట పటిమ దేశపౌరులందరికీ ఆదర్శం. 1959 అక్టోబరు 21న హిమాలయాల్లోని ఆక్సాయిచిన్ అనే ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను శత్రు దేశం హతమార్చింది. అప్పటి నుంచి దేశభద్రతకు ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నాం. ఆ వీరుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వారూ ఉన్నారు. వారి సేవలను మరోసారి గుర్తుచేసుకుందాం.



షేక్ ఇస్మాయిల్ (ఏఆర్ కానిస్టేబుల్)

పోలీసు కానిస్టేబుల్‌గా 1966లో ఉద్యోగం పొందారు. అనంతరం ఎంటీ విభాగంలో సీనియర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. 2001 ఫిబ్రవరి 1న మావోయిస్టులు కురుపాం మండలం లోవలక్ష్మీపురం గ్రామ శివార్లలో ఒక కానిస్టేబుల్‌ని గాయపరిచి అతని వాహనాన్ని దగ్ధం చేశారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసు బృందాలను తీసుకుని, పోలీసు వాహనంలో బయలుదేరి వెళ్తుండగా, మావోయిస్టులు మాటు వేసి మందుపాతర పేల్చి పోలీసు వాహనాన్ని పేల్చేశారు. ఆ ఘటనలో పోలీసు వాహనానికి డ్రైవర్‌గా వున్న ఇస్మాయిల్‌తో పాటు, కానిస్టేబుల్ శ్రీరాములు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే ఇద్దరూ అమరులయ్యారు.



బి.శ్రీరాములు

శ్రీరాములు 1993లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. 2001 ఫిబ్రవరి 1న మావోయిస్టులు కురుపాం మండలం లోవలక్ష్మీపురం గ్రామ శివార్లలో కానిస్టేబుల్‌ని గాయపరిచి అతని వాహనాన్ని దగ్ధం చేశారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలతో సంఘటన స్థలానికి పోలీసు బృందంతో కలిసి వెళ్తుండగా మావోయిస్టులు పేల్చిన మందుపాతరతో పోలీసు వాహనం ధ్వంసమైంది. ఈ బృందంలో సభ్యుడిగా వున్న బి.శ్రీరాములతో పాటు డ్రైవర్ ఇస్మాయిల్ కూడా తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మరణించారు.



ఎస్.సూర్యనారాయణ

సూర్యనారాయణ 1993లో పోలీసు కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి 2003 మే 30న మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టులు మాటు వేసి పెద్దింటి జోడి గ్రామం వద్ద మందుపాతరను పేల్చారు. ఆ ఘటనలో సూర్యనారాయణ తీవ్రంగా గాయపడి 2003 మే 30న అమరులయ్యారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను త్రుణ ప్రాయంగా అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ఎన్నడూ మరువలేం.



అమరవీరుల స్థూపం

ముద్దాడ గాంధీ, చిరంజీవి





గాంధీ పోలీసుశాఖలో రిజర్వు ఇన్‌స్పెక్టరుగా 1985లో ప్రవేశించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం అనతి కాలంలోనే 1991లో సివిల్ విభాగానికి బదిలీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని కొమరాడ పోలీసు స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు నిర్వహించే సమయంలో కొప్పడంగి అటవీప్రాంతంలో పెద్ద ఎత్తున మావోయిస్టులు సమావేశం అవుతున్నారన్న కీలక సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు అందించారు. 1998 ఆగస్టు 8న కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన పోలీసులు మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, మావోయిస్టులు పోలీసు బృందాలపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ 9 మంది అగ్రనాయకులను కోల్పోయింది. అప్పటి నుంచి ప్రతీకారం తీర్చుకునేందుకు ముద్దాడ గాంధీని లక్ష్యంగా చేసుకున్నారు. సాలూరు సీఐగా ఉండగా 2001 ఆగస్టు 28న సాలూరు న్యాయస్థానంలో ఒక కేసుకు సంబంధించి సాక్ష్యం చెప్పేందుకు వెళ్లిన గాంధీపై, ఆయన అంగరక్షకుడు..కానిస్టేబుల్ చిరంజీవిపై అతి కిరాతకంగా కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఇన్‌స్పెక్టరు ముద్దాడ గాంధీ, కానిస్టేబుల్ చిట్టిపంతుల చిరంజీవిలు న్యాయస్థానంలోనే నేలకొరిగారు.. అమరులయ్యారు..

అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- 21 నుంచి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు
- ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. సినిమా థియేటర్లలో పోలీసు ఇమేజ్‌ను రెట్టింపు చేసేలా గుర్తింపు పొందిన సినిమాలు, వీడియో క్లిప్స్‌ని ప్రదర్శించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు అమరవీరుల స్వస్థలాలను, వారు చదువుకున్న పాఠశాలలను అధికారులు, సిబ్బంది సందర్శించి పోలీసుశాఖకు వారందించిన సేవలను వివరిస్తామన్నారు. 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీసులు వినియోగించే ఆయుధాలు, టెక్నాలజీ, నేర పరిశోధనలో డాగ్స్‌ని ఏ విధంగా వినియోగిస్తారు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి 27 వరకూ వివిధ పాఠశాలల్లోనూ, జిల్లా కేంద్రాల్లోనూ రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 28న పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. 29న జిల్లా వ్యాప్తంగా విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్‌ల పరిధిలో కళాశాలలు, పాఠశాలలు పోలీసు త్యాగాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నామన్నారు. 30న జిల్లా కేంద్రంలో జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు యూనిటీ రన్‌ని నిర్వహిస్తామన్నారు. ఈ రన్‌లో ప్రజలు, యువత, పోలీసులు భాగస్వాములు అవుతారన్నారు. సాయంత్రం మూడులాంతర్లు నుంచి కోట జంక్షన్ వరకూ క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

'మన్యం'లో ఏర్పాట్లు పూర్తి..

పార్వతీపురం, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం జాతీయ పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు, కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, జిల్లా పోలీసు అధికారులు తదితరులు హాజరుకానున్నారు.



పార్వతీ పరమేశ్వరులు, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం బొమ్మ గీస్తున్న రుగడ శ్రీనివాసరావు

'చిత్ర' కళకు జీవం పోస్తున్న రుగడ

ఆయన కుంచె నుంచి వచ్చే ప్రతిచిత్రంలో జీవకళ ఉట్టి పడుతుంది. అటువంటి చిత్రాలు వేలల్లో వేసి ఎందరో ప్రముఖులతో శభాష్ అనిపించుకోవడమే కాకుండా.. సన్మానాలు చేయించుకున్నారు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రుగడ శ్రీనివాసరావు. ప్రస్తుతం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో సీఆర్‌టీగా విధులు నిర్వహిస్తున్నారు.

జియ్యమ్మవలస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి)

కుటుంబ నేపథ్యం..

గరుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన రుగడ ఆనందరావు, చిన్నమ్మడు దంపతులకు నలుగురి సంతానంలో పెద్దవాడైన శ్రీనివాసరావుకు చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం అంటే చచ్చేంత ఇష్టం. భార్య కృష్ణకుమారి, కుమారుడు వంశీ, కుమార్తె మైత్రి ఉన్నారు. ఆయన తండ్రి ఆనందరావు చిన్నప్పుడు కర్రతో అందమైన వస్తువులను తయారు చేస్తుంటే.. కుమారుడు శ్రీనివాసరావు కుంచెతో చిత్రాలను గీసేవాడు. మిత్రులు, పెద్దల సూచనల మేరకు బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో చేరారు. అక్కడ చిత్ర లేఖనంలో మరిన్ని మెలకువలు నేర్చుకొని..తన ప్రతిభకు పదును పెట్టారు. అలా చిత్రకారుడిగా మంచి గుర్తింపు పొందారు. అనేక పాఠశాలల్లో దేశ నాయకులు, ఇతర చిత్రకారుల చిత్రాలను ఉచితంగానే గీస్తూ ఉండేవాడు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఉన్న అనేక పాఠశాలల్లో ఆయన గీసిన చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని పాఠశాలల్లోనూ ఆయన అనేక చిత్రాలు గీశారు. ఆలయాల్లో దేవతామూర్తుల చిత్రాలు గీసి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. సీఆర్టీగా పనిచేస్తున్న ఆయన తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు చిత్రకళలో తర్ఫీదు ఇస్తున్నాడు. వారు జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయిల్లో మంచి ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకుంటున్నారు.

ఎన్నో అవార్డులు..

జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం టీడబ్ల్యూఏ బాలుర ఉన్నత పాఠశాలలో రుగడ శ్రీనివాసరావు సీఆర్టీగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో ఆయనకు ఎన్నో అవార్డులు, సత్కారాలు లభించాయి.

- 2018లో ఉమ్మడి విజయనగరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి కలెక్టర్ హరిజవహర్‌లాల్, జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి ద్వారా అవార్డు అందుకున్నారు.
- 69వ గణతంత్ర వేడుకల సందర్భంగా అప్పటి పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డాక్టర్ జి.లక్ష్మీషా ద్వారా ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్నారు.
- 2023లో పార్వతీపురం మన్యం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ నిశాంత్ కుమార్ నుంచి అవార్డు అందుకున్నారు.
- రాష్ట్రస్థాయి చిత్ర లేఖనం పోటీలకు విజయనగరం జిల్లా తరుపున కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు వ్యవహరించారు.
- 2023లో రాష్ట్ర స్థాయి డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా లైజన్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావును ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ ఎంపిక చేశారు.
- ఆయన వద్ద శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

ప్రస్తుతం ఐటీడీఏ పాఠశాలల్లో సీఆర్‌టీగా పనిచేస్తున్నా. నా ప్రతిభను అధికారులు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

-రుగడ శ్రీనివాసరావు, డ్రాయింగ్ టీచర్, టీడబ్ల్యూఏహెచ్ స్కూల్, ఆర్ఆర్‌బీ పురం



విద్యార్థులకు డ్రాయింగ్‌లో తర్ఫీదు ఇస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)

బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధన

- జిల్లాలో నాలుగు హాస్టళ్లు ఎంపిక
- విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యం



డిజిటల్ క్లాస్ రూం కోసం కొత్తవలస వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ (బీసీ) వసతి గృహాల్లో డిజిటల్ బోధనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో డిజిటల్ బోధనను ప్రవేశ పెడుతుంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటుంది. దీని కోసం దివంగత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ పేరిట డిజిటల్ రిసోర్సు సెంటర్లను ఏర్పాటు చేయనుంది. 8, 9, 10 తరగతుల విద్యార్థులను పరిగణనలోకి తీసుకుని సొంత భవనాలు ఉన్న ప్రీమెట్రిక్ వసతి గృహాలను ఎంపిక చేయాలంటూ బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే జిల్లా బీసీ సంక్షేమ అధికారులు మొదటి విడతగా కొత్తవలస, బొబ్బిలి, విజయనగరం టౌన్, గజపతినగరం వసతి గృహాలను డిజిటల్ బోధన కోసం ఎంపిక చేశారు. ఇందులో గజపతినగరం తప్పా మిగిలిన మూడూ బాలికల వసతి గృహాలే. ప్రతి వసతి గృహంలో ఒక గదిని గుర్తించి అందులో డిజిటల్ తరగతులు బోధించే విధంగా తయారు చేస్తున్నారు. దీని కోసం రూ.లక్ష వరకూ ఖర్చు అవుతుందని ప్రభుత్వానికి నివేదిక సమర్పించా రు. డిజిటల్ క్లాస్ రూంలో ఒక కంప్యూటర్, ఇంటరాక్టివ్ బోర్డు, పెన్‌డ్రైవ్ ఉంటుంది. పాఠశాల ముగిసిన తరువాత వసతి గృహాలకు చేరుకున్న విద్యార్థులకు ట్యూటర్ల ద్వారా సబ్జెక్టుల్లోని సందేహాలను నివృత్తి చేయనున్నారు. దీని ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించనున్నారు. ఈ విషయమై జిల్లా ఏబీసీడబ్ల్యూవో యశోధనరావు మాట్లాడుతూ.. 'జిల్లాలో డిజిటల్ బోధన కోసం నాలుగు వసతి గృహాలను ఎంపిక చేశాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని' వెల్లడించారు.

పారిశ్రామికంగా ప్రోత్సహిస్తే.. సిరుల పంటే..





గిరిజనులు పండించిన పసుపు

- ఏజెన్సీలో వ్యవసాయ ఆధారిత చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు
- గిరిజన రైతుల పంటలకు గిట్టుబాటు ధర.. స్థానికంగా గిరిజన యువతకు ఉపాధి
- ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విన్నపం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మన్యంలో అటవీ ఉత్పత్తులకు కొదవే లేదు.. గిరిజన రైతులు కూడా ఎన్నో రకాల పంటలను సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. అయితే నేటికీ సరైన మార్కెట్ సౌకర్యం లేక తీవ్రంగా నష్టపోతున్నారు. దళారుల దోపిడీకి గురవుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత చిన్న తరహా పరిశ్రమలు చేయాలని వారు కోరుతున్నారు. దీనివల్ల స్థానిక గిరిజన యువతకు ఉపాధి లభించడంతో పాటు తమ పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందని వారు భావిస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వారితో పాటు గిరిజన సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, సాలూరు తదితర మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో వరితో పాటు అటవీ ఉత్పత్తులైన చింతపండు, చీపుర్లు, కరక్కాయలు, పసుపు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు సాగవుతున్నాయి. వీటిపై ఆధారపడి ఎంతోమంది గిరిజన రైతులు జీవనం సాగిస్తున్నారు. అయితే చింతపండు, కరక్కాయలు, కొండ చీపుర్లను మాత్రమే గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కొనుగోలు చేస్తుంది. ఇక జీడి, పసుపు, రాగులు, సజ్జలు, జొన్నలు తదితర పంటలను రైతులు తప్పని సరి పరిస్థితుల్లో దళారులు, ప్రైవేట్ వ్యాపారులు చెప్పిన ధరలకే విక్రయించాల్సి వస్తోంది. దీంతో వారు ఏటా నష్టాలను చూవి చూస్తున్నారు. ఆయా పంటలకు సంబంధించి చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు. స్థానికంగా ఉన్న గిరిజన రైతులను ప్రోత్సహించి యూనిట్ల స్థాపనకు అధికారులు కృషి చేస్తే.. యువతకు ఉపాధి, రైతులకు మద్దతు ధర లభించే అవకాశం ఉందని గిరిజ సంఘాల నాయకులు కూడా అభిప్రాయపడుతున్నారు.

ఇలా చేస్తే..

- వాస్తవంగా జీసీసీ ఏటా పది వేల క్వింటాళ్ల వరకు చింతపండు సేకరిస్తోంది. అయితే దానిని వాల్యుడేట్ చేసి ఫ్లవర్ టామరిండ్‌గా మార్చి సూపర్‌బజార్లు, మాల్స్‌కు అందజేస్తే జీసీసీతో పాటు గిరిజన రైతులకు కూడా మంచి ఆదాయం వస్తుంది.
- ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయంలో సేంద్రియ పద్ధతితో పండించే పసుపులో ఔషధ గుణాలు ఎక్కువ. అందుకే దీనికి డిమాండ్ ఎక్కువ. గిరిజన ప్రాంతంలో 500 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ పసుపు కొమ్ములను పొడిగా మార్చి మార్కెటింగ్ చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.
- ఏజెన్సీలో జీడి పంట విస్తృతంగా సాగవుతోంది. సుమారు 20 వేల టన్నుల వరకు జీడిపక్కు దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. అయితే మన్యంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడంతో గిరిజన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో వాటిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. జిల్లాలో అధికంగా సాగయ్యే జీడికి సంబంధించి చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే గిరిజన రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. అదేవిధంగా ఇక్కడి జీడిపప్పును టీటీడీ, సింహాచలం, విజయవాడ కనకదుర్గ దేవస్థానం తదితర ఆలయాలకు అందిస్తే మంచి ఆదాయం వస్తుందని గిరిజన పెద్దలు చెబుతున్నారు.
- ఈ ప్రాంతంలో రైస్‌మిల్లులు ఏర్పాటు చేస్తే గిరిజన రైతులకు ఎంతో అనువుగా ఉంటుంది. ధాన్యం విక్రయాలు, రవాణా, మిల్లింగ్ కష్టాలు తప్పుతాయి. యువతకు కూడా ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వం గిరిజన యువతకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించి.. వారికి తగిన ఆర్థిక సహాయం చేస్తే.. మంచి ఫలితాలు వస్తాయని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఫుడ్ కార్పొరేషన్ ఇండియా గోదాములు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.
- సుమారు మూడు వేల ఎకరాల్లో పత్తి పంట సాగవుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో దారం తీసే మిల్లులు ఏర్పాటు చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

చిన్నతరహా పరిశ్రమలతోనే ఉపాధి

చిన్నతరహా పరిశ్రమలతోనే ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వం గిరిజన యువతకు తగిన శిక్షణ ఇచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

-నీలయ్య, గిరిజన రైతు ఎస్‌కే పాడు

ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది..

ఇటీవల కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశ్రమల ఏర్పాటుపై సమావేశం ఏర్పాటు చేశారు. మన్యం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి తగిన విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

-సాల్మన్‌రాజు, ఎంపీడీవో, గుమ్మలక్ష్మీపురం

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు
- జిల్లా వ్యాప్తంగా పలు శంకుస్థాపనలు

నెల్లిమర్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని పూతికపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆమె ఆదివారం శంకుస్థాపన చేశారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, చనమల్లు వెంకటర మణ, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, ఎడ్ల గోవింద రావు, టీడీపీ జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: చిల్లపేట, సారిక, గుండాలపేట, బియ్యాలపేట, పడాలపేట తదితర గ్రామాల్లో 'పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు విజ యనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శంకుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: పార్టీలకు అతీతంగా పల్లెలకు పూర్వ వైభవం తీసుకువస్తామని నెల్లిమర్ల నియోజకవర్గం కూటమి ఎంఎల్ఏ లోకం నాగమాధవి తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బొడ్డవలస పంచాయతీలో అభివృద్ధి పనులకు ఎ మ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ వాసుదేవ రావు, ఎంపీడీవో భవాని, టీడీపీజనసేన, నాయకులు, కార్యకర్త లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్: మండలంలో పల్లెపండుగ కార్యక్రమం ముగిసింది. ఆదివారం మండలంలోని వెంకటరమణపేట, తిమిడి, వీరనారాయణం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన పూజలు చేశారు. ఎంపీపీ సోమేశ్వరరావు మండలపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ నాయుడు, జుత్తాడ రామసత్యం, టీడీపీ రాష్ట్రకార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ ఉన్నారు.

శృంగవరపుకోట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందని ఎ మ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం పేదఖండేపల్లి రోడ్డులో సాయిబాబా ఆలయం వద్ద కాలు వ నిర్మాణానికి భూమి పూజచేశారు. ఎంపీపీ నండిసోమేశ్వరరా వు, వైస్ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, నాయకులు కొణదం మల్లేశ్వర రావు, జనసేన నాయకులు ఒబ్బిన సత్యనారాయణ, సన్యాసినాయుడు తదితరులు న్నారు.

కురుపాం రూరల్: ప్రభుత్వం ఏజెన్సీలోని రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఆదివారం గుంజరాడ-ఉరిడి రోడ్డు, మంటికొండ-చన్ని అంటిజోల రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలి శెట్టి కొండయ్య, భగవాన్ మిశ్రో, వెంపటాపు భారతి, మంజువాణి, రంజిత్ కుమార్ నాయికో, బెహరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: పల్లె పండుగ ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి,


విజయనగరం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి


ఎస్.కోట పెదకండేపల్లి రోడ్డులో కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల


కురుపాంరూరల్: ఎమ్మెల్యే జగదీశ్వరికి స్వాగతం పలుకుతున్న గిరిజనులు

న్యూస్ బాక్స్

కైలాసనాథేశ్వర స్వామి ఆలయానికి విరాళం

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కంటుభుక్త వారి వీధిలోని ద్రాక్షామణి సమేత కైలాసనాథేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం జనసేన నాయకులు గురాన అయ్యలు రూ. 50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రాక్షామణి, కైలాసనాథస్వామి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలని ఆకాక్షిస్తున్నట్టు తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

గుర్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): అధికారులు నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా పని చేయాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సిరి అన్నారు. ఆదివారం మండలంలోని గుర్ల, నాగళ్లవలస గ్రామాల్లో పర్యటించి రోగులను పరామర్శించారు. ఎవరూ అధైర్యపడొద్దని, నీటి కలుషితం వల్ల ఇటువంటి పరిస్థితులు వచ్చి ఉండవచ్చునన్నారు. వీటిపై పూర్తిగా నివేదించాలని అధికారులను ఆదేశించారు.

బొత్స పరామర్శ

గుర్లలో ఇటీవల ప్రబలిన డయేరియా రోగులను రాష్ట్రశాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ పరామర్శించారు. డయేరియా సోకి వాంతులు, వీరోచనాలతో గత కొన్ని రోజులుగా రోగులు మరణించడం బాధాకరమన్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను కోరారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులున్నారు.

వరద బాధితులకు రూ. 4 లక్షల ఆర్థికసాయం

రాజాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు యడ్ల గోపాలరావు రూ. 2 లక్షలు ఆర్థిక సాయం శనివారం అందించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి చెక్కును అందజేశారు. దీంతో పాటు అఖిల ప్రజా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో నాటికను ఏర్పాటు చేసి సేకరించిన రూ. 2 లక్షల విరాళాలను కళాకారులతో కలిసి గోపాలరావు అందజేశారు. రాష్ట్ర కళాకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

అప్స ఆధ్వర్యంలో..

సంతకవిటి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్స) ప్రధాన కార్యదర్శి, శ్రీ సంతోషి పబ్లిక్ స్కూల్స్ కరస్పాడెంట్ తమ్మినేని సీతారాం శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అప్స ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు 64 లక్షల 2 వేల 8 వందల 54 రూపాయలను చెక్కు రూపంలో సీఎం సహాయనిధికి అందచేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి చెక్కుని అందించిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు రాజు, కౌన్సిల్ చైర్మెన్ సుందరరావు, గౌరవాధ్యక్షులు మెట్ట జనార్దనరావు, ఉత్తరాంధ్ర అధ్యక్షులు గణపతిరావు, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ భాస్కరరావు ఉన్నారు.

యడ్లకు నగదు పురస్కారం

రాజాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు పద్మశ్రీ పుర స్కార గ్రహీత యడ్ల గోపాలరావును తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రీ పురస్కారంతో పాటు రూ 25వేలు రూపా యలు నగదును ఆదివారం అందజేశారు. ప్రముఖ సినీరచయిత బుర్రా సాయి మాధవ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు-2024 ముగింపుసభ రోజున పద్మశ్రీ పుర స్కార గ్రహీత యడ్ల గోపాలరావు తెనాలి పట్ట ణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చేతులు మీదుగా సన్మానించారు.

'ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే పనిచేశా'

బొబ్బిలి అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): గతంలో రెండు సార్లు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసినప్పుడు ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే తాను ఆయా ప్రభుత్వాలతో స్నేహ పూర్వకంగా మెలిగానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ ఇతర మిత్ర సంఘాల తరపున బరిలో దిగుతున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక ఓ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదె మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శ్రీనివాసులునాయుడు కోరారు. వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఆర్‌టీయూ రెండు జిల్లాల నాయకులు డి.శ్రీనివాసరావు, వాలేటి తవిటినాయుడు, బి.శివప్రసాద్, గంట శశికుమార్, రావాడ రాంబాబు, శివరామ్ , గౌరీశంకర్ తదితరులుపాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డిస్క్‌త్రో పోటీలకు గురుకుల విద్యార్థిని


ప్రమీల

నెల్లిమర్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-19 డిస్క్‌త్రో రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక ఎంజేపీఏపీ బీసీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని ప్రమీల ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమామోహిని తెలిపారు. ఈ సందర్భంగా ఆ బాలికను అభినందించారు.

డ్వాక్రా బజార్‌లతో ఆర్థిక ఆసరా

- సరస్ ముగింపు కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు తాము తయారు చేసిన వస్తువుల అమ్మకం ద్వారా ఆర్థిక ఆసరా పొందేందుకు డ్వాక్రా బజార్‌లు దోహదపడతాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఏడాది పొడువునా మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లను సెర్ప్ ద్వారా చేస్తామని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిల భారత డ్వాక్రాబజార్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం రాష్ట్రంలో ఏటా నాలుగు చోట్ల డ్వాక్రా బజార్ ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. అమరావతిలో 10 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత స్థాయిలో డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకం, ప్రదర్శన కోసం ఓ కేంద్రం ఏర్పాటు చేసేందుకు తగిన స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కోరామని, అందుకు ఆయన అంగీకరించినట్లు తెలిపారు. విజయనగరం డ్వాక్రాబజార్‌లో ఈ 10 రోజుల్లో రూ.7.20 కోట్ల అమ్మకాలు జరగటం గొప్పవిషయమన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ ప్రతి ఇంటా ఓ పారిశ్రామిక వేత్త ఉండాలన్న ముఖ్యమంత్రి ఆశయానికి తగ్గట్లుగా ప్రోత్సాహికులను తయారు చేసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు రూపొందించిన చేతి ఉత్పత్తులు, వస్త్రాలు, హస్తకళాకృతుల అమ్మకాలతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్, నాబార్డు డీజీఎం నాగార్జున, ఎల్‌డీఎం రమణ మూర్తి, డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరావు, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

విశాఖ డెయిరీ డైరెక్టర్ అమ్మడమ్మ మృతి


అమ్మడమ్మ (ఫైల్)

బొబ్బిలి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పక్కి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్న గారి సతీమణి, జల వనరుల శాఖ నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ శంబంగి సుగుణాకరరావు మాతృమూర్తి, విశాఖ డెయిరీ సీనియర్ డైరెక్టర్ శ్రీమతి శంబంగి అమ్మడమ్మ(87) అస్వస్థతకు గురై విశాఖ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

జూదరుల పట్టివేత

నెల్లిమర్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సారిపల్లి టిడ్కో కాల నీ సమీపంలో జూదమాడుతున్న ఆరుగురిని నెల్లిమర్ల పోలీసులు ఆదివారం పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి ఐదు వేల 520 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బొబ్బిలి రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ శుక్రవారం రాత్రి బొబ్బిలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈసందర్భంగా, ఆదివారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన వారి కుటుంబాన్ని, అరసాడ విశాల్ తల్లిదండ్రులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో కాలం చేసిన కెల్ల గురునాయుడు, కోలా రాము కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, గ్రామ సర్పంచ్ పువ్వల మాధవ, నాయకులు పిరిడి ఈశ్వరరావు, కాకల వెంకటరావు, టీడీపీ కార్యకర్తలు, తదితురులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు

నెల్లిమర్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నెల్లిమర్లలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయకు చెందిన ముగ్గురు బాలికలు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేక అధికారి బి.ఉమ తెలిపారు. ఈ పాఠశాలకు చెందిన వి.లిఖిత అండర్-17 త్రోబాల్ పోటీలకు, వై.హారిక అండర్ -19 బాస్కెట్‌బాల్ పోటీలకు, ఎస్.భారతి అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురిని అభినందించారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలను మూసేస్తున్నారు

కొత్తవలస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర చెల్లించకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నారని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యదర్శి జే కిషోర్ బాబు అన్నారు. కొత్తవలస జూట్‌మిల్లులో విధించిన అక్రమ లాకౌట్ వల్ల వీధిన పడిన కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కొత్తవలస జూట్ కార్మికులకు సంబంధించి సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడా కార్పోరేట్ కంపెనీల ప్రయోజనాలకు అనుగుణంగా పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్యరంగాలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన జూట్, పంచదార మిల్లులను మూసివేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. సంవత్సరానికి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జూట్ మిల్లు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ ఉమా జూట్ మిల్లులో అక్రమంగా లాకౌట్ విధించిందని, కార్మికుల తప్పేమీ లేకున్నా యాజమాన్యం లాకౌట్ విధించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. జూట్‌మిల్లులో లాకౌట్ విధించడం అన్యాయం, చట్టవ్యతిరేఖమని తెలియ చేస్తూ మూడు సార్లు శృంగవరపుకోట శాసన సభ్యురాలుకు వినతిపత్రం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. విజయనగరం డీసీఎల్ వద్ద మూడు సార్లు, విశాఖపట్టణం జేసీఎల్ వద్ద ఏడుసార్లు చర్చలు జరిగినా యాజమాన్యం ఒక్కసారి కూడా చర్చలకు రాలేదన్నారు. అధికారులు ఏర్పాటు చేసిన సమావేశాలకు హాజరు కాకుండా కాలయాపన చేస్తున్న యాజమాన్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు కర్రు శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్. రాంబాబు కార్మికులు పాల్గొన్నారు.

అఖిలాండేశ్వర ఆలయంలో పూజలు

రేగిడి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నయ్యపేటలో నూతనంగా నిర్మించిన అఖిలాండేశ్వరి ఆలయంలో పూజలు రెండోరోజు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 50మంది దంపతులు సమూహిక పూజలు, వ్రతాలు ఆచరించి తమ భక్తిభావం చాటుకున్నారు. ఇంద్యాంకు చెందిన అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేవళ్ల శ్రీనివాసరావు దంపతులు, పరిసర గ్రామా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డయేరియా బాధిత బాలలకు పరామర్శ


వైద్యాధికారులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఘోషాసుపత్రిలో వైద్యసాయం పొందుతున్న జిల్లాలోని గుర్ల గ్రామంలో డయేరియా బాధిత బాలలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సీడబ్ల్యూసీ చైర్మన్ హిమబిందుతో కలిసి పరామర్శించారు. వారికి అందుతున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టరు సుజాత, చైల్డ్‌లైన్ సిబ్బంది మీనాకుమారి పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన బేబీనాయన


ఆరోగ్య కేంద్రం మరమ్మతుల గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది, స్థానిక ఎంపీటీసీ నాగరాజు, పాత ఆరోగ్యకేంద్రం భవనం మరమ్మతుల విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే మరమ్మతులు చేయించి, మౌలిక సదుపాయాలు కల్పించమని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'వంశవృక్షం' నవలపై విశ్లేషణ


మాట్లాడుతున్న పాదిలాపు శ్రీనివాసరావు

రాజాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సనా తన ధర్మం, ఆధునిక సంప్రదాయం మధ్య జరిగిన సంఘర్షణల సమ్మేళనమే వంశ వృక్షం నవల అని ప్రముఖ సాహితీవేత్త పొదిలాపు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక వేదగాయత్రీ జూనియర్ కళాశాలలో రాజాం రచయితల వేదిక స మావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాసరావు ప్రఖ్యాత కన్నడ రచయిత ఎస్ భైరప్ప రచించిన వంశవృక్షం నవల మీద విశ్లే షణాత్మక ప్రసంగం చేశారు. రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగిన సమా వేశంలో వేదిక సభ్యులు శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, పెంకి దయానిధినాయుడు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక


మంత్రి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

గంట్యాడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన అప్పలనాయుడు, సారాది వెంకటరావుతోపాటు మరో 120 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు అల్లు విజయకుమార్, గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి రామునాయుడు, సుంకరి సాయి కృష్ణ తదితరులున్నారు.



సత్యసాయికి ప్రత్యేక ప్రార్థనలు

రాజాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబావారి అవతార దినోత్సవాన్ని ఆదివారం సుందరం మందిరం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బాబా వారి చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్, రాష్ట్ర సేవాదళ్ కో ఆర్డినేటర్ ఎం సత్యనారాయణ, జిల్లా సేవాదళ్ కో ఆర్డినేటర్ మనోహర్, జిల్లా స్టడీ సర్కిల్ సత్యనారాయణ, జిల్లా ఐటి ఇన్‌చార్జి షైమా, రాజాం జోనల్ కన్వీనర్ రాజు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మొక్కజొన్న రైతులను ఆదుకోండి

- పంట సాగు.. నూర్పిడిలో ఇబ్బందులు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్

బొబ్బిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రాంతం చెరకు పంట సాగుకు ప్రసిద్ధి అయినప్పటికీ చక్కెర పరిశ్రమలు మనుగడను కోల్పోతుండడంతో చెరకు రైతులంతా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. అలా సాగు చేస్తున్న పంటలలో మొక్కజొన్న పంట ఒకటి. మొక్కజొన్న పంటసాగులో రైతులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. వాణిజ్యపంటల్లో మొక్కజొన్న సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పంటదిగుబడులు ఆశాజనకంగానే ఉంటాయి. కానీ గత నెల రోజుల నుంచి వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉండడంతో మొక్కజొన్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే మొక్కజొన్న పంటలను నూర్చుకోవడానికి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గున్నతోటవలస, ఎం.బూర్జివలస, పెంట తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట సాగులో భాగంగా పంటల నూర్పుడు జరుపుకుంటున్నారు. యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతులు తమ పంటలను వాటి ద్వారా నూర్చుకుంటున్నారు. యంత్రాల అద్దెకోసం అదనంగా ఖర్చుచేయాల్సి వస్తోంది. యంత్రాలను వినియోగించినా లేబర్‌ను ఏర్పాటు చేసుకోకతప్పడం లేదు. పండిన పంటలను వ్యాపారులు కళ్లాల దగ్గరకు వచ్చి కొనుగోలు చేసుకుంటున్నారు. వారు అడిగిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. క్వింటాలు మొక్కజొన్న గింజలు 2300 రూపాయల ధర పలుకుతోంది. అన్ని రకాల వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే మొక్కజొన్న దిగుబడులు బాగుంటాయి. గిట్టుబాటుగా ఉంటుంది. ఎకరాకు 35 క్వింటాళ్ల గింజలు దిగుబడికి అవకాశం ఉంది.


ఎం.బూర్జివలసలో మొక్కజొన్న పంటను నూర్చుతున్న రైతులు

వర్షాలు కురిస్తే లాభదాయకమే

ఎండలు, వర్షాలు సమతుల్యంగా ఉంటే మొక్కజొన్న పంట లాభదాయకమే. ఎకరాకు 30 క్వింటాల వరకు మొక్కజొన్న దిగుబడి ఉంటుంది. క్వింటాలు 2300 రూపాయల ధర ఉంది. ఇటీవల 2500 పైనే ఉండేది. ఇప్పుడు వ్యాపారులు ధరను తగ్గించేశారు. చెరకు పంటకు బదులుగా మొక్కజొన్న వేసుకుంటున్నాం. మార్కెటింగ్ సదుపాయం లేదు. ఏఎంసీ వారు కొనుగోలు చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారులకే పంటలను అమ్ముకుంటున్నాం. లేబర్ ఖర్చులు ఎక్కువగా భరించాల్సి ఉంటోంది.

-సత్యనారాయణ, గున్నతోటవలస రైతు

చిన్నారికి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు


చిన్నారి ధన్విక తల్లిదండ్రులకు మెడల్ వేస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన ఐదు నెలల చిన్నారి సిరికి ధన్విక తన ప్రతిభతో నోబెల్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకొని అందరిచే ఔరా అనిపించుకుంది. 120 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. గ్రామానికి చెందిన సిరికి లక్షుంనాయుడు, హారిక దంపతుల కుమార్తె ధన్వికకు రెండు నెలల వయస్సు నుంచి తల్లిదండ్రులు వివిధ వస్తువులు, బొమ్మలు చూపించి గుర్తుపట్టేలా అవగాహన కల్పించారు. ఇలా 120 రకాల విభిన్న ఫ్లాష్ కార్డులు (జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు, రంగులు, వివిధ దేశాల జెండాలు) గుర్తుపడుతున్న వీడియో రికార్డులను నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు పంపించగా.. వారు రికార్డుకు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు ప్రశంసాపత్రం, మెడల్స్‌ను ధన్విక తల్లిదండ్రులకు పంపించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చిన్నారి ధన్విక మెడలో మెడల్ వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ధన్విక తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

పార్వతీపురం,ఆంధ్రజ్యోతి/పార్వతీపురంటౌన్ ,అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వడిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా నిర్వహించే మేళాలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ చదువుకుని 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సులగల నిరుద్యోగ యువత పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జాబ్ మేళాకు 18 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులను ఎంపిక చేసి వారి కంపెనీలో ఉపాధి కల్పిస్తారని తెలిపారు.

●పార్వతీపురంరూరల్,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్వీడీ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు గ్రామ్ ఉత్కర్ష అభియాన్‌పై వర్క్‌షాపు

గుమ్మలక్ష్మీపురం,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దాత్రి అభజన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏ పీవోలు, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు, గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు హాజరుకానున్నారు. ఈసందర్భంగా గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి కావలసిన మౌలిక వసతులపై చర్చించనున్నారు. వర్క్‌షాపులో గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నబాబు,రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొనున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు చేయూత

కురుపాం,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కురుపాంలో ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖలోని రిటైర్డ్ నేవీ ఉద్యోగులు, మిస్పా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చేయూతనిచ్చారు. ఆదివారం ట్రాన్స్‌జెండర్లకు జీవనోపాధికి కొబ్బరి కాయలు, పూజ సామగ్రి అమ్మకంకోసం, కిరాణాషాప్, హోటల్ ఏర్పాటుకు వస్తువులు, నగదు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో మిస్పా వెల్ఫేర్ అధ్యక్షుడు షిరాన్ ఖాన్, రిటైర్డు నేవీ ఉద్యోగులు నగేష్, శిరాజ్‌ద్దీన్, ప్రతాప్, తిరుపతిరావు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ట్రాన్స్ జెండర్అధ్యక్షురాలు ఎ.గీతారాణి పాల్గొన్నారు.

వర్షం కురిస్తే.. వరద కష్టాలు

● కాలువలు నిర్మాణానికి నోచుకోని వైనం
● ఇదీ పార్వతీపురంలో పరిస్థితి

పార్వతీపురం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని ప్రధాన రహదారిలో వర్షం కురిస్తే నివాసితులు, వ్యాపారులకు కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిస్తే వరదనీరంతా రహదారిపైకి చేరడంతో వ్యాపారులతోపాటు పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బందులుపడుతున్నారు. జిల్లా కేంద్రంగా మారి మూడేళ్లు దాటుతున్నా ప్రధాన రహదారిలోని వరదనీటిని మళ్లించేందుకు అధికారులు కనీసం చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. ప్రధానరహదారిలోని ఆర్టీసీకాంప్లెక్స్ కూడలితోపాటు మేదరవీధి కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు వరదనీరు నిలిచిపోతున్న విషయం విదితమే. ఆ సమయంలో నివాసాలు, షాపుల్లోకి చొచ్చుకుపోవడంతో అగచాట్లు తప్పడంలేదు. 2004లో జిల్లా కేంద్రలోని బెలగాం గెడ్డవీధి నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు ప్రధాన రహదారి విస్తరించారు.అప్పట్లో ఆర్అండ్‌బీ, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు రహదారి విస్తరణ చేపట్టినా, వరద నీరు వెళ్లేందుకు కాలువల నిర్మించకపోవడంతో ఇక్కడి ప్రజల పాలిటశాపంగా మారింది. వర్షాకాలంతో పాటు శనివారం కురిసిన వర్షానికి ప్రధానరహదారిపై మోకాళ్ల లోతులో వరదనీరు నిలిచిపోవడం వల్ల నివాసితులు, వ్యాపారులు, పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు. దీంతోపాటు ప్రధాన రహదారిలోని కాలువల్లో పూడికలు తూతూమంత్రంగా తీసుండడంతో వరదనీరు వెళ్లే అవకాశం లేకుండాపోతోంది. అంతేకాకుండా ప్రధాన రహదారి ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం వల్లే వర్షాలు కురిస్తే నీరు నిలిచిపోతోందని పలువురు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలోనైనా వరదనీటి ముంపు నుంచి విముక్తి కలుగుతుందని ప్రధాన రహదారిలో ఉంటున్న నివాసితులు, వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా వరదనీటి మళ్లింపుకు తక్షణమే ప్రణాళికలు సిద్ధంచేస్తామని మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం డీఈ కిరణ్ తెలిపారు.



ప్రధాన రహదారిలో నిలిచిన వరదనీటిని మళ్లిస్తున్న వ్యాపారులు (ఫైల్)



మహిళల సమస్యలు వింటున్న మంత్రి సంధ్యారాణి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి సంధ్యారాణి

సాలూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.ఆదివారం సాలూరులోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. సంబందిత అధికారులతో మాట్లాడి ప్రాధాన్యాత్రమంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

● గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని అరకు, పాడేరు నాయకులు వంటల నాగేశ్వరరావు, బొర్రా నాగరాజు కోరారు.● ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మక్కువ మండలంలోని చెముడు గ్రామానికి చెందిన నిరుద్యోగ మహిళలు కోరారు.● తాగునీరు సమస్య పరిష్కరించాలని పట్టణలో దండిగాం రోడ్డులోని మహిళలు విన్నవించారు.● ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ట్రాక్టర్ యజమానులు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం 125 రోజుల్లోనే ఉచిత ఇసుక విధానం తీసుకురావడంతో తమకు జీవితంపై ఆశలు చిగురించాయని పేర్కొన్నారు. ●బొబ్బిలికి చెందిన ఆరు నెలలు చిన్నారి ధన్సిక ఈనెల 14న కీపర్స్ ఆఫ్ ది నోబెల్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. 27 జంతువుల బొమ్మలు, 27 కూరగాయలు బొమ్మలు, 212 పండ్ల ఫోటో గ్రాఫిక్ కార్డులను గుర్తించడంతో నోబుల్‌బుక్ ఆఫ్‌వరల్డ్ రికార్డ్‌లో పేరును నమోదు చేసుకుంది. దీంతో బాలిక తల్లిదండ్రులు హారిక సిరి, లక్ష్మణరావులను మంత్రి సత్కరించారు.

బడిదేవర కొండపై మైనింగ్ చట్ట విరుద్ధం

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

బెలగాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బడిదేవర కొండపై మైనింగ్ అనుమతులు ఇవ్వడం చట్టవిరుద్ధమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి ఆరోపించారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో బండిదేవర కొండపై తవ్వకాలు నిలిపివేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవర కొండపై మైనింగ్ కోసం అనుమతులు ఇవ్వడం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని తెలిపారు. గతంలో ఆ కొండ రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఉందని చెప్పి అక్కడ గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చారని, ఇప్పుడు అదే కొండ రెవెన్యూ పరిధిలో ఉందని పట్టాలు రద్దుచేశారని ఆరోపించారు.ఎన్నో ఏళ్ల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులు జీవనోపాధికోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కొండపై తవ్వకాలు ఆపాలని, ఆపే వరకు ఉద్యమిస్తామని తెలిపారు.సమావేశంలో ఆయా సంఘాల నాయకులు శ్రీను నాయుడు, పి.సంగం, పాకల సన్యాసి, రెడ్డివేణు, బంటు దాసు, రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పెదబొండపల్లిలో ఏనుగుల సంచారం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతోషికుమారి

పార్వతీపురం రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబొండపల్లి శివారులో ఏనుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం రూరల్ ఎస్.సంతోషి కుమారి ఏనుగుల సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఏనుగుల వల్ల ఎటువంటి హాని జరగకుండా అటవీశాఖతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు. కొద్దిరోజులుగా మండలంలోనే ఏనుగులు తిష్ఠ వేయడంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఐక్యంగా పోరాడుతాం

● ఏఐజీడీఎస్ సెక్రటరీ అప్పారావు



సంఘాల నాయకులు సమావేశం ఏర్పాటుచేసిన దృశ్యం

బెలగాం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తపాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడి పరిష్కరించకోవాలని ఏఐజీడీఎస్ సెక్రటరీ ఎం.అప్పారావు పిలుపునిచ్చారు.ఆదివారం పార్వతీపురంలోని ఎన్జీవో హోంలో ఏఐపీఈయూ, జీడీఎస్, ఏఐజీడీఎస్ సంఘాలనాయకులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కేంద్ర సంఘాల నాయకులు సూచన మేరకు ఏఐపీఈయూ, జీడీఎస్ సంఘాలను ఏఐజీడీఎస్‌లో విలీనం చేయడం శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సంఘాలనాయకులు బి.ఉమాశంకర్రావు, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

పాచిపెంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంచాళిలో ఆదివారం గ్రామ సంరక్షణ నిధి నిర్వాహకుడు పాంచాలా రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన వైద్యులు కె.రవికాంత్, కె.శ్రీబాల 90 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈసందర్భంగా వైద్య సహాయం అనంతరం దీర్ఘకాలిక రోగులకు సూచనలు, సలహాలు, ఆహార నియమాలు, ఇంట్లో ఆహారసాధారణ జీవనవైద్యం, ఆరోగ్యం జీవ న విధానంపైఅవగాహన సదస్సు నిర్వహించారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

సాలూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. స్వామివారికి నిత్య దైవిక కార్యక్రమాల్లో భాగంగా మంత్ర, తంత్ర, క్రియ, ద్రవ్య లోప నివారణార్థం పవిత్రోత్సవాలు రుత్వికులు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, రమాసత్యనారాయణస్వామి, దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నారాయణాచార్యులు, ఉదయాచార్యులు తదితర రుత్వికులు, భక్తులు పాల్గొన్నారు.

కార్టూనిస్టుకు సన్మానం

గరుగుబిల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివలస గ్రామానికి చెందిన కార్టూనిస్టు భానుకు ఆదివారం గ్రామస్థులు సన్మానించారు.ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పలు రకాల కార్టున్లు వేస్తూ జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్, కళాకారుడు బల రాంనాయుడు, తోటపల్లి దేవస్థానం మాజీ చైర్మ న్ మర్రాపు సత్యనారాయణ, సర్పంచ్ అప్పడు, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, డాక్టర్ వి.శి వున్నాయుడు, ఆర్.పెదబాబులు పాల్గొన్నారు.



వర్షంతో రైతులకు అగచాట్లు

భామిని, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి రైతులు అగచాట్లకు గురయ్యారు. భామిని, ఘనసర, బాలేరు, సింగిడి తదితర గ్రామాల్లోమధ్యాహ్నం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఏజెన్సీలో పత్తి, వరి, మొక్కజొన్న రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటకోతకు వచ్చింది. భామిని తదితర గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న పంటను పొలాల్లో సేకరించారు. ఇంతలో వర్షంకురవడంతో ఇంటికి తెచ్చేలోపే తడిసి ముద్దయింది. సేకరించిన మొక్కజొన్న పంటను రైతులు టార్పాలిన్లు కప్పి జాగ్రత్త పరిచారు. వర్షం వల్ల చేతికందిన పత్తి ప్రస్తుతం వేరేందుకు వీలుండదని, దీంతో నల్లబారిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● పార్వతీపురం రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండతీవ్రతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం భారీ వర్షంతో ఉపశమనం కలిగించింది.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 23వ తేదీ నుంచి 26 వరకు తుఫాన్ వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాలను తనిఖీ చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఎవరూ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలకు హెచ్చరించాలన్నారు. తుపాన్ గురించి అన్ని శాఖలు ప్రజలకు అప్రమత్తం చేయాలని తెలి పారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రధాన కేంద్రాలు విడిచి వెల్లరాదన్నారు. ఎటువంటి ప్రాణ నష్టంజరుగుకుండా చూడాలని ఆదేశించారు.

గరుగుబిల్లిలో 'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలలకు సెలవు దినాల్లో విద్యార్థులకు పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తక సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.





కార్యకర్తలకు టీడీపీ అండ: కోళ్ల


కొత్తవలస, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే ప్రతికార్యకర్తకూ టీడీపీ అండగా ఉంటుందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం కొత్తవలస పంచాయతీ రాజపాత్రుని పాలెం గ్రామానికి చెందిన పెదిరెడ్ల నాగరాజును ఆమె పరామర్శించారు. నాయకులు పీవీ రత్నాజీ, కోళ్లశ్రీను, గొంపదుర్గా ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికలు

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానీనగర్ డాక్టర్ వరలక్ష్మి పాఠశాలలో ఆదివారం సీనియర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికలు జరిగాయి. ఎంపికైన వారు నవంబరు 8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

రాయగడ,అక్టోబరు 20(ఆంధ్రజ్యో తి): రాయగడ స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ వచ్చేనెల 10న నిర్వహించనున్న వార్షికోత్సవంలో భాగంగా సంస్థ కార్యాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగం వారికి రతన్‌టాటా చిత్రం లేక దుర్గా దేవి మండపం, జూనియర్ విద్యార్థులకు వినాయకుని చిత్రం, లేక పల్లెసౌందర్యం అన్న అంశంపై పోటీలు నిర్వహించారు. విజేతలకు వార్షికోత్సవం పురస్కరించుకుని బహుమతులు అందజేస్తామని సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరిశంకరప్రసాద్ తెలిపారు.





కోమట్లపేట సమీపంలో నిలిచిపోయిన లారీలు(ఇన్‌సెట్లో) కట్‌ప్లేట్ విరిగిన లారీ

బొగ్గు లారీ కట్ ప్లేట్లు విరగడంతో.. అంతర్రాష్ట్ర రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

కొమరాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కోమట్లపేట సమీపంలో అంతర్రాష్ట్ర రహదారి మధ్యలో విశాఖ నుంచి ఒడిశా వైపు వెళ్తున్న బొగ్గు లారీ కట్ ప్లేట్లు, హౌసింగ్ బోల్టులు విరిగిపోవడంతో ఆదివారం ఉదయం ఆరు గంటలప్రాంతంలో రహదారి మధ్యలో నిలిచిపోయింది. దీంతో రహదారికి ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కేవలం ఆటోలు, కార్లు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. భారీలోడుకావడంతో అన్‌లోడ్‌చేసి మరమ్మతులు చేయాలని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికీ లారీని పక్కకు తీసే ఏర్పాట్లు చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.కూనేరు, రాయగడ తదితర ప్రాంతాలకు వెళ్లవలసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను రద్దుచేశారు. దీంతో ప్రయాణికులు ఆటోల్లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారడంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు.







